క్లుప్తంగా

నాగులపల్లిలో రీ సర్వే గ్రామసభ



నాగులపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి గ్రామ సచివాలయం-1 వద్ద శనివారం తహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రీ సర్వేకు సంబంధించి భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాదగయకు చేరిన టెంపుల్ టూరిజం బస్సు



పిఠాపురంలో టెంపుల్ టూరిజం యాత్రికులు

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ ఆధ్వర్యంలో బయలుదేరిన యాత్రికుల టెంపుల్ టూరిజం బస్సు శనివారం పిఠాపురం పాదగయకు చేరుకుంది. ఆలయ అధికారులు బస్సులో యాత్రికులకు ఘన స్వాగతం పలికారు. 18 మంది యాత్రికులు గల ఈ బస్సును రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ వద్ద ఉదయం జెండా ఊపి మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఉదయం 8.30 గంటలకు కోరుకొండ, ఉదయం 10.30 గంటలకు అన్నవరం, మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక కుక్కుటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. యాత్రికులకు దేవస్థాన సిబ్బంది స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ఆశ్వీర్వచనాలు అందజేశారు. కార్యక్రమములో దేవస్థానం ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి అమ్మవార్లు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం దశమిని పురస్కరించుకొని ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లొకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకట రమణ, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజాసమస్యను త్వరితగతిన పరిష్కరించాలి

కాకినాడ సిటీ: ప్రజాసమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శనివారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద సమావేశపు మందిరంలో ప్రజా ఫిర్యాదులపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులు- పరిష్కరించినవి వాటిపై సమీక్షించారు. పరిష్కరించక పోవడానికి గల కారణాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వీటిపై సంబంధిత అధికారులను జేసీ రాహుల్ మీనా వివరణ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రతి ఒక్క ఫిర్యాదును పరిశీలిస్తామని జేసీ తెలిపారు. ప్రతి ఒక్క ఫిర్యాదుపై పూర్తి అవగాహనతో సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం జరిగిన అండర్-14, అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో మంచి ప్రదర్శన ఇచ్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో బి.రిషికేష్ ఎ.ధనుష్, ఓ.మనోజ్‌కుమార్ ద్వితీయ స్థానాలు సాధించారు. అండర్ -17 విభాగంలో ఎ.లోవరాజు, ఎల్.రామ్‌నాయుడు, అజయ్ కుమార్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు.

శతాబ్ది పార్కులో వసతులు కరవు

- పాములకు నిలయంగా పెద్దాపురంలో ప్రసిద్ధి చెందిన పార్కు
- బెంబేలెత్తుతున్న పర్యాటకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధిని పట్టించుకోని కూటమి నేతలు



పెద్దాపురం మున్సిపల్ పార్కులో పామును చంపుతున్న సిబ్బంది

పెద్దాపురం: పట్టణంలో పార్కులు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాద వాతావరణం కల్పించింది మేమే అంటూ కూటమి నాయకుల ప్రకటనలకు వాస్తవ పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. పెద్దాపురం పట్టణంలో ఆగస్టు 15న అట్టహాసంగా ప్రారంభించిన మున్సిపల్ శతాబ్ది పార్కులో కనీస వసతులు లేక, పారిశుద్ధ్య నిర్వహణ కరువవ్వడంతో ఇక్కడికి వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రారంభించిన అనంతరం కూటమి నేతలు, అధికారులు ఆ పార్కు అభివృద్ధిపై దృష్టి సారించిన దాఖాల్లేవు. ప్రచార ఆర్భాటాలు మినహా పార్కు అభివృద్ధిపై ఇటు అధికారులు, అటు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకున్న పాపాన పోలేదు. నిత్యం ప్రజలతో కళకళలాడే పార్కును అభివృద్ధి చేసి మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చామన్న నేతల మాటలు బూటకమని తేలిపోయింది. పార్కు ప్రారంభించి నాలుగు నెలలు కావస్తున్నా కనీసం సింహద్వారం మార్గంలో పర్యాటకులు అనుమతి లేదు. అదేంటని ప్రశ్నిస్తే ఇంకా అభివృద్ధి పనులు జరుగుతున్నాయంటూ అక్కడ సిబ్బంది పర్యాటకులను వెనక్కి పంపిస్తున్నారే తప్ప ఆహ్లాదాన్ని ఆస్వాదించే అవకాశం కల్పించడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు.

పాములు సంచారంతో భయం..భయంగా పర్యాటకులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పట్టణంలో శతాబ్ది పార్కు ప్రారంభోత్సవం పేరుతో హడావుడిగా తుప్పలను తొలగించారు. సుమారు రూ.20 లక్షల మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించిన అనంతరం అభివృద్ధి పనులను విస్మరించారు. కేటాయించిన నిధుల్లో ఐదు లక్షల రూపాయలు ఖర్చు పెట్టి మిగిలిన నిధులు పక్కదారి పట్టడంతోనే పార్కు అభివృద్ధి పనులు నిలిచిపోయినట్లు విమర్శలు వస్తున్నాయి.

అక్కడ సిబ్బందికి జీతాలే లేవు

పాములు, దోమలు, కటిక చీకటిలో విధులు నిర్వర్తిస్తున్న అక్కడ సిబ్బందికి ఇప్పటికీ జీతాలు అందడం లేదు. నైట్ వాచ్‌మెన్ పేరుతో నలుగురు సిబ్బందిని నియమించారు. వారు పార్కులో పగలు, రాత్రిళ్లు విధులు నిర్వర్తిస్తున్నారు. బిల్లులు, కాంట్రాక్టర్ల పేరుతో సాకులు చెప్పి ఇప్పటికీ వారికి జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అదేంటని ప్రశ్నిస్తే ఈ కాస్త ఉద్యోగం ఉండదేమోనన్న భయం వారిని వెంటాడుతోంది.

ఏమైనా జరిగితే బాధ్యులెవ్వరూ ?

పార్కులో పాములు సంచారం ఎక్కువగా ఉంది. పైకి వెళ్లవద్దు అంటూ అక్కడ కాపలాదారులు మొరపెడుతున్నా పర్యాటకులు వినే పరిస్థితి లేదు. అక్కడ ఓ మహిళ భారీ పామును చూసి స్పృహ తప్పి పడిపోతే సిబ్బంది కిందికి తీసుకువచ్చి పరిచర్యలు చేయడంతో మహిళ ఊపిరి పీల్చుకుని ఇంటికి వెళ్లిపోయింది. ఇటువంటి సంఘటనలు జరగకూడదనే ముందుగా పర్యాటకులను హెచ్చరిస్తున్నామని, యువత మొండిగా లోపలికి వెళుతున్నారని, దీంతో భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది వాపోతున్నారు. పురపాలక ఉన్నతాధికారులు దృష్టి సారించి పార్కులు పాముల సంచారం, పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా షరా మామూలే



పార్కులో ఉండే ఇబ్బందులపై మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పార్కుకు వచ్చే పర్యాటకులకు ఎప్పుడు ఏ సమయంలో ఆపద వచ్చినా పట్టించుకునే నాథుడు లేడు. పార్కు అభివృద్ధి అంటున్నారే తప్ప ఎక్కడా ఆచరణలో లేదు. పాములు, పిచ్చితుప్పలతో పార్కు హీనంగా తయారైంది. ఉన్నతాధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి.

– గుణ్ణం లక్ష్మణరావు, షర్డ పీపుల్ పౌండేషన్ ఛైర్మన్, పెద్దాపురం

పార్కు అభివృద్ధికి చర్యలు చేపడతాం



శతాబ్ది పార్కు అభివృద్ధిపై అన్ని చర్యలు చేపడతాం. అక్కడ అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్నాయి. పర్యాటకులను అక్కడ సిబ్బందితో ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. పర్యాటకులు సహకరిస్తే త్వరలోనే పార్కును మరింత అభివృద్ధి చేస్తాం. అక్కడ పాముల సంచారంపై చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం. పర్యాటకులుకు భయపడాల్సిన పనిలేదు.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

రైల్వే గేటు మీదుగా కార్లు, ఆటోలకు బ్రేక్



గాంధీచౌక్ వద్ద రోడ్డుపై పోల్స్ ఏర్పాటు చేయిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సామర్లకోట: రైల్వే గేటు మీదుగా కార్లు, ఆటోలకు ప్రవేశం లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ గతంలో ట్రాఫిక్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వాహన చోదకులు ట్రాఫిక్ బోర్డులను జరిపి వేసి వాహనాలతో రైల్వే గేటు మీదుగా రాక పోకలు సాగిస్తున్నారు. గేటు తీసిన సమయంలో కెనాల్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దాంతో పెద్దాపురం డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఎ కృష్ణభగవాన్ సూచనలతో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగా రావు గాంధీ చౌక్ వద్ద రోడ్డుపై ఇనుప పోల్స్ ఏర్పాటు చేశారు. దాంతో పశువులు, సైకిళ్లు, మోటారు సైకిళ్లు మాత్రమే రాకపోకలకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు చిన్న వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక కౌంటర్లలో వంట నూనెల విక్రయం

కాకినాడ సిటీ: వినియోగదారులకు అనువైన ధరలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరా శాఖ మంత్రి, రాష్ట్రస్థాయి అధికారులు, ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, హోల్‌సేల్ డీలర్ల అసోసియేషన్, పెద్ద చైను రిటైలర్లతో మాట్లాడి వంట నూనెలు అమ్మేందుకు స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్పెషల్ కౌంటర్లులో పామాయిల్ (850 గ్రాములు) ధర రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ (910 గ్రాములు) ధర 124 రూపాయలకు అమ్మే విధంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా జిల్లాలో ఉన్న రైతు బజార్లు, మార్కెట్లలో విక్రయించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. హోల్‌సేల్ దుకాణాలు, డీమార్ట్, రిలయన్స్ నుంచి కూడా వినియోగదారులు పై ఉదాహరించిన ధరలకు పొందవచ్చన్నారు.

శృంగార వల్లభుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



తిరుపతి శృంగారవల్లభ స్వామి



స్వామి వారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా ఆలయానికి రూ.1,32,353 ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు.. ఈ సందర్భంగా సుమారు పది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా నాలుగువేల మందికి అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర విద్యాలయంలో ఏడో తరగతి విద్యార్థులకు పడాల ట్రస్ట్ దుస్తులను అందజేసింది. శనివారం విద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.చెన్నకేశవరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు రూ.1.50 లక్షలు విలువ చేసే దుస్తులు పంపిణీ చేశారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.

రైల్వే టైమ్ టేబుల్

సామర్లకోట మీదుగా విజయవాడ వైపు వెళ్లు రైళ్లు

రైలు నెంబరు	ఎక్కడ నుంచి ఎక్కడకు	సర్వీసు	రాక	పోక
20805	విశాఖపట్నం - న్యూఢిల్లీ	ప్రతిరోజు	00-08	00-10
12703	హౌరా - సికింద్రాబాద్	ప్రతి రోజు	00-44	00-45
11020	భువనేశ్వర్-బెంగుళూరు	ప్రతిరోజు	00-54	00-55
17220	విశాఖపట్నం-మచిలీపట్నం	ప్రతిరోజు	01-04	01-05
12552	కామాఖ్య - బెంగుళూరు	శుక్ర	01-08	01-10
22883	పూరి - బెంగుళూరు	శని	01-23	01-25
22707	విశాఖపట్నం-తిరుపతి	మంగళ, శుక్ర, ఆది	01-23	01-25
18519	విశాఖ-లోకమాన్యతిలక్	ప్రతి రోజు	01-43	01-45
22859	పూరి - చెన్నైసెంట్రల్	సోమ	03-13	03-15
22825	షాలిమార్-చెన్నైసెంట్రల్	బుధ	03-44	03-35
17258	కాకినాడ-విజయవాడ	ప్రతి రోజు	04-33	04-35
12755	కాకినాడ-భావనగర్	గురు	05-53	05-55
17481	బిలాస్‌పూర్-తిరుపతి	బుధ,ఆది	05-49	05-50
17479	పూరి - తిరుపతి	బుధ, ఆది	05-49	05-50
22851	సంత్రాగచి-మంగుళూరు	శుక్ర	06-13	06-15
18045	షాలిమార్-హైదరాబాద్	ప్రతి రోజు	06-33	06-35
17206	కాకినాడ-సాయినగర్‌షిర్డి	సోమ, బుధ, శని	06-24	06-25
22701	విశాఖపట్నం-విజయవాడ	గురు, ఆది	07-48	07-50
12773	షాలిమార్-సికింద్రాబాద్	గురు	08-03	08-05
12805	విశాఖ-లింగంపల్లి	ప్రతి రోజు	08-44	08-45
17221	కాకినాడ-లోకమాన్యతిలక్	బుధ, శని	09-23	09-25
17240	విశాఖ-గుంటూరు	ప్రతీ రోజు	09-59	10-00
22807	సంత్రగాచి-చెన్నై	బుధ, శని	09-43	09-45
22841	సంత్రగాచి-తాంబరం	మంగళ	09-44	09-45
18567	విశాఖ-కొల్లం	గురు	09-44	09-45
12803	విశాఖ-నిజాముద్దీన్	సోమ,శుక్ర	10-18	10-20
18503	విశాఖ-సాయినగర్	గురు	10-38	10=40
12835	హటియా-బెంగుళూరు	మంగళ,బుధ	11-03	11-05
12376	జసిదీహ్-తాంబరం	గురు	11-04	11-05
18637	హటియా-బెంగుళూరు	ఆది	11-04	11-05
22837	హటియ-ఎర్నాకులం	మంగళ	11-04	11-05
18111	టాటానగర్-బెంగుళూరు	శుక్ర	11-04	11-05
13351	ధన్‌బాద్-అలప్పుజ	ప్రతి రోజు	11-29	11-30
12863	హౌరా-బెంగుళూరు	ప్రతి రోజు	14-44	14-45
17644	కాకినాడ-పుదుచ్చేరి	ప్రతి రోజు	14-53	14-55
18047	షాలిమార్-వాస్కోడాగామా	మంగళ,బుధ,శుక్ర,ఆది	14-59	15-00
12717	విశాఖ-విజయవాడ	ప్రతి రోజు	15-14	15-15
17250	కాకినాడ-తిరుపతి	ప్రతి రోజు	15-28	15-30
18463	భువనేశ్వర్-బెంగుళూరు	ప్రతి రోజు	15-43	15-45
17488	విశాఖపట్నం-కడప	ప్రతి రోజు	16-39	16-40
12845	భువనేశ్వర్-బెంగుళూరు	ఆది	16-29	16-30
12660	షాలిమార్-నాగర్‌కోయిల్	గురు	16-28	16-30
12839	హౌరా-చెన్నై సెంట్రల్	ప్రతి రోజు	16-29	16-30
17210	కాకినాడ-బెంగుళూరు	ప్రతి రోజు	17-38	17-40
15906	డిబ్రుఘర్-కన్యాకుమారి	సోమ	17-54	17-55
17015	భువనేశ్వర్-సికింద్రాబాద్	ప్రతి రోజు	19-03	19-05
12737	కాకినాడ-లింగంపల్లి	ప్రతిరోజు	19-33	19-35
12727	విశాఖ-హైదరాబాద్	ప్రతి రోజు	19-53	19-55
20803	విశాఖ- గాంధీధాం	గురు	20-23	20-25
20819	పూరి- ఓఖా	ఆది	20-23	20-25
12861	విశాఖ-కాచిగూడ	ప్రతి రోజు	20-59	21-00
22801	విశాఖ- చెన్నై	శుక్ర	21-18	21-20
12783	విశాఖ-సికింద్రాబాద్	ఆది	21-18	21-20
22869	విశాఖ-చెన్నై	సోమ	21-18	21-20
12898	భువనేశ్వర్-పుదుచ్చేరి	మంగళ	21-18	21-20
22879	భువనేశ్వర్-తిరుపతి	శని	21-38	21-40
22871	భువనేశ్వర్-తిరుపతి	ఆది	21-38	21-40
17244	రాయగడ-గుంటూరు	ప్రతి రోజు	22-39	22-40
18189	టాటానగర్-ఎర్నాకులం	గురు,ఆది	22-33	22-35
12739	విశాఖ-సికింద్రాబాద్	ప్రతి రోజు	22-54	22-55

కల్తీ నెయ్యి అమ్మకాలను అరికట్టాలి

భజరంగ్ దళ్ నాయకుల డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న భజరంగ్ దళ్ నాయకులు

పిఠాపురం: జంతువుల కళేబరాలతో తయారు చేసే కల్తీ నెయ్యికి పిఠాపురం అడ్డాగా మారుతోందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్తీ నెయ్యి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగ్ దళ్ నాయకులు వెంకటేశ్వరరావు, సురేంద్ర దత్త డిమాండ్ చేశారు. పిఠాపురంలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం పిఠాపురంలో గోవుల కళేబరాలతో కల్తీ నెయ్యి తయారు చేసి ఆలయాలు, పూజా సామగ్రి షాపుల్లో విక్రయాలు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పిఠాపురంలో అధికారులు సోదాలు నిర్వహించి దాదాపు 300 కేజీల జంతు కొవ్వును పట్టుకున్నారన్నారు. ఈ జంతు కొవ్వుతో కల్తీ నెయ్యి తయారు చేసే అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. కల్తీ నెయ్యి పిఠాపురం నుంచే ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా అవుతోందని, దీనిపై పూర్తి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజిలెన్స్ అధికారులను అప్రమత్తం చేసి, స్పెషల్ టీం వేయాలని డిమాండ్ చేశారు. కల్తీ నెయ్యితో దీపారాధన చేస్తే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. హిందూ ధర్మం ప్రతిష్ఠ, హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరచే విషయం కావడంతో దీనిపై ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాధవపట్నం రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతులు రీ సర్వే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో మాధవపట్నంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ఈ రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతుల దస్తావేజుల్లో, వారి స్వాధీనంలో ఉన్న భూమి మరొకరికి రికార్డు అయితే రీ సర్వేలో మార్పు చేసుకోవచ్చని తెలిపారు. అవసరమైన సమయంలో నోటీసులు ఇచ్చి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రతి రైతూ ఈ రీ సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ సభల్లో సాయంత్రం వరకు 21 అర్జీలు అందాయని ఆయన చెప్పారు. సబ్ డివిజన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రెండు, పట్టాదారు పాస్ పుస్తకంలో పేరు మార్పు కోసం ఆరు, రీ సర్వే తరువాత విస్తీర్ణం తగిందని 12, సర్వే నంబరు తప్పుగా ముద్రితమైందంటూ ఒక అర్జీ అందిందని తహసీల్దార్ వివరించారు. 29 మంగళవారం అచ్చంపేట పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, మండల సర్వేయర్ పి. సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు ఎం రమేష్, సీహెచ్ స్వాతి, వై. సాయికిరణ్, వీఆర్వోలు జి. నాగేశ్వరరావు, వై మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కొత్తపల్లి: ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొత్తపల్లి పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... యానాంలో మద్యం కొనుగోలు చేసి బీచ్ రోడ్డులో తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేశారు. మద్యం తరలిస్తున్న పాయకరావుపేట మండలం పాలపిండి గ్రామానికి చెందిన మైలపల్లి నగేష్, పిక్కి ఏసేబులను పొన్నాడ శివారు కాశివారిపాకల వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి 180 ఎంఎల్ గల 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రెండు మోటార్ సైకిళ్ల సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా, అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పంట కాలువ గట్ల ఆక్రమణ



కాశివారిపాకలు శివారులో కాలువ గట్టును ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్డు



ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన ఇటుకల బట్టి

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కొందరు చెరువులు, గోదావరి కాలువ గట్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో పడి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొండెవరం శివారు కాశివారిపాకలకు వెళ్లే గోదావరి గట్టును, మాధాపురం వైపు వెళ్లే గట్టును కొందరు ఆక్రమించారు. కాలువను ఆనుకుని ఉన్న రహదారిని ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. కబ్జాదారులు ఇప్పటికే చెరువును ఆక్రమించి ఇటుకల బట్టి ఏర్పాటు చేశారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ గట్ల ఆక్రమణతో పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.